క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



ఊట్కూరు: స్థానిక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కళ్యాణిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని, మండలంలో నెలకొన్న భూమి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్ రెడ్డి, ఎల్కోటి లక్ష్మీకాంత్‌రెడ్డి, కథలప్ప, మోహన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని ఎక్కమేడ్ ఎంపీపీఎస్ పాఠశాలలో రాష్ట్రీయ బాల సంరక్షక టీం ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 48 మంది విద్యార్థులకు ఎత్తు, బరువు, కంటి, పళ్ల తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు మందులను అందజేశారు. ఒక విద్యార్థిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తామని డాక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, అమీనా తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ప్రవీణ్‌కుమార్, ఎఎన్ఎం అమీనా, హెచ్ఎం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించాలి



మద్దూరు: ప్రతి ఒక్కరూ ఈ వర్షాకాలంలో తప్పని సరిగా మొక్కలు నాటాలని ఎంపీడీఓ జయరాములు ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని పర్సపూర్ గ్రామంలో ఎంపీఓ రామన్నతో కలిసి వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. నాటి ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే రోగాలు దూరం

మాగనూర్: మండలంలోని గ్రామాలను పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, మాగనూర్, గురువలింగంపల్లి గ్రామ పంచాయతీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో గ్రామంలోని ప్రతి వీధిని నిత్యం శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. అనంతరం పంచాయతీల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నర్సింహారెడ్డి, తిమ్మప్ప, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ మహోత్సవం

నారాయణపేట: పట్టణంలోని కొండారెడ్డిపల్లి చెరువు సమీపంలోని మహాపుర ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం స్వకుల సాలి సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి కుంకుమ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నైవేద్యం మహా మంగళహారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, నెట్‌వర్క్: జీపీ, ఆశా, కస్తూర్బా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లో మంగళవారం ధర్నా చేసేందుకు పిలుపునివ్వడంతో పోలీసులు వారిని జిల్లావ్యాప్తంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యలు నెరవేర్చాలని శాంతియుతంగా ధర్నా చేసేందుకు సిద్ధపడితే పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్వతమ్మ, వెంకటమ్మ, ఉదయభాను, ఇమ్రాన్, మహేశ్వరి, జయమ్మ, సుధ, నిర్మల, నర్సమ్మ, వెంకటేష్, భీమప్ప, జైనోద్దీన్, మహిపాల్ ఉన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలి

నారాయణపేట: నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అశ్విని అశోక్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా కమిటీ సమావేశంలో నిర్వహించి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నర్సింలు, రాము, గోపాల్ పాల్గొన్నారు.

పంటల్లో చీడపీడల బెడద

- నివారణ చర్యల్లో రైతులు
- పెసర, పత్తి రైతుల ఆందోళన
- కంది 15వేల ఎకరాల్లో, పెసర 4 వేల ఎకరాల్లో సాగు



దామరగిద్ద శివారులో సాగు చేసిన పత్తిపంట

దామరగిద్ద: వానాకాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా పత్తి, కంది, పెసర పంటలను సాగు చేశారు. కాగా ప్రస్తుతం పెసర, పత్తి పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయి. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో కంది పంటకు ఎండు తెగులు సోకి వేరు కుళ్లు తెగులు సోకుతుంది. మండలంలో ఎనిమిది వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో జూన్ చివరి వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీనికి తోడు బోరుబావుల్లోను భూగర్భ జలాలు అడుగంటడంతో వరి సాగుపై రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో వరి విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సాగు విస్తీర్ణం ఇలా..

మండలంలో మొత్తం 39,888 ఎకరాల సాగు భూమి ఉండగా.. అత్యధికంగా కందిపంటను 15వేల ఎకరాల్లో సాగు చేశారు. వరి సాగు చేసేందుకు 10 వేల ఎకరాల్లో ఏర్పాట్లు చేసుకున్నా.. ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. గతేడాది 9,800 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ ఏడాది సగానికి తగ్గిందని అధికారులు తెలిపారు. పెసర గతేడాది 2 వేల ఎకరాల్లో సాగు చేస్తే ఈ ఏడాది 6 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. మినుము 200 ఎకరాలు, జొన్న 200 ఎకరాలు, చిరుధాన్యాలు 35 ఎకరాలు, ఆముదం 40 ఎకరాలు, కూరగాయ పంటలు 110 ఎకరాల్లో, హార్టికల్చర్ పద్ధతిలో పంటలను 350 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

రైతుల్లో ఆందోళన

పెసర పంటను ఆశిస్తున్న తెల్లదోమ, పేనుబంక, రసం పీల్చే పురుగులు, జీడ తెగులు, మరక మచ్చ



పత్తి పంటను ఆశించిన పేనుబంక

పురుగు వంటివి పంట దశ 30 రోజుల నుంచి గింజ పట్టే దశ వరకు ఎక్కువగా పంటను ఆశిస్తుంటాయి. వాటి నివారణకు క్వినాల్‌ఫాస్, లీటర్ నీటికి ఒక మిల్లీలీటర్ లేదా క్లోరిపైరిపాస్ లేదా మోనోక్రోటపాస్ 2.5 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వీటితో పాటే వేప నూనె 5 ఎంఎల్ ఒకలీటరు నీటిలో కలిపి పంటలపై చల్లితే చీడపపీడలను నివారించవచ్చు. కాయతొలిచే మరుక మచ్చల పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోట్ మందును ఎకరాకు 60 నుంచి 80 గ్రామాల చొప్పున 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



తక్కువ కాలంలో చేతికి వచ్చే పెసర పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. జీడ, మరుక మచ్చల పురుగు పెసర పంటను ఆశిస్తున్నాయి. పత్తిలో పేనుబంక, నల్లి, తెల్లదోమ, పచ్చదోమ పంటలను ఆశిస్తూ నష్టపరుస్తున్నాయి. పంట సాగులో అప్రమత్తంగా ఉండి చీడపీడల గుర్తించి వెంటనే మందులు పిచికారీ చేయాలి. పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏఏ మందులు ఎంత మోతాదులో పిచికారీ చేయాలని నిరంతరం వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– ప్రదీప్‌కుమార్, ఏఓ, దామరగిద్ద

మానవ అక్రమ రవాణా నివారించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నర్వ: దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో మానవ అక్రమ రవాణా ఒకటని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం, ఇండియన్ జస్టిస్ మిషన్ నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. మానవ అక్రమ రవాణాలో ఉపాధి పేరుతో పేదల ఆర్థిక సమస్యలను ఆసరాగా చేసుకొని అనేక విధాలుగా మానవ అక్రమ రవాణా జరుగుతుందని వాపోయారు. దీనిపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందుకు సంబంధించి ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098, పోలీస్ ఎమర్జెన్సీ 100 లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కురుమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సెంట్రలైజ్ కిచెన్' ఆలోచన విరమించాలి

ఊట్కూరు: ప్రభుత్వం పాఠశాలల్లో సెంట్రలైజ్ కిచెన్ ఆలోచన విధానాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్ కోరారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి స్థానిక ఎమ్మార్సీ భవనం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 54 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వారి ఉపాధికి విఘాతం కలిగించే విధంగా ప్రభుత్వం సెంట్రలైజ్ కిచెన్ విధానం చేపట్టే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అక్షయపాత్ర పేరుతో కార్మికుల ఉపాధి దెబ్బతీసే కుట్ర జరిగిందని, కార్మికులు ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతనంగా చేపట్టే విధానాలను విరమించి మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బంది సరస్వతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు పద్మమ్మ, అనిత, సునిత, వెంకటప్ప, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ధన్వాడ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల వనరుల కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. 22ఏళ్ల క్రితం మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించినప్పటి నుంచి కార్మికులకు కనీస వేతనం అందడం లేదని వాపోయారు. కార్యక్రమంలో తాయిబాయి, శివాబాయి, సులోచన, జైతుబాయి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకల్లో విద్యార్థులు

కోస్గి: మండలంలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు నిర్వహించిన సైన్స్ గోరింటాకు వేడుకలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూనే సైన్స్‌ను జోడించి పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు ప్రత్యేకతను చాటుకున్నాయి. ఆషాఢ మాసంలో సీజనల్ వ్యాధులు రాకుండా గోరింటాకు పెట్టుకోవడం శాస్త్రీయతతో కూడుకున్న సంప్రదాయమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠ్య పుస్తకాల్లో ఉన్న సైన్స్‌కు సంబంధించిన వివిధ చిత్రాలను గోరింటాకుతో చేతులపై బొమ్మలు వేయించి సంప్రదాయాల్లో సైన్స్ అనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు.

శివాజీ విగ్రహాన్ని యథాస్థానంలోనే ఉంచాలి

కోస్గి: జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై ఉన్న శివాజీ విగ్రహాన్ని పనులు పూర్తి చేసిన తర్వాత యథాస్థానంలోనే కొనసాగించాలని కోరుతూ పలు సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా విగ్రహాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అభివృద్ధి పనులను అడ్డుకోకుండా శివాజీ విగ్రహాన్ని గతంలో ఉన్న స్థలంలోనే ఏర్పాటు చేయాలని కోరగా.. ఇందుకు కమిషనర్ సైతం సానుకూలంగా స్పందించినట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని వినతి

కోస్గి: నూతనంగా ఏర్పాటు చేసిన కోస్గి బస్ డిపో ద్వారా అరకొర బస్సులతో ప్రజలకు ఆశించిన సేవలు అందడం లేదని, డిపోలో బస్సుల సంఖ్యను పెంచాలని మంగళవారం సీపీఐ నాయకులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కొడంగల్ క్యాంపు కార్యాలయంలో అధికారిని కలిసి పాత బస్సులను మార్చి కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు సౌకర్యం ఉన్న ఎన్నో గ్రామాలకు నేటికీ బస్సులు రావడం లేదని వాపోయారు. కార్యక్రమంలో మహ్మద్, ఇందనూర్ బషీర్, శ్రీనివాస్, శ్యాం సుందర్, నాగేంద్రప్ప, రాజు, రహీం పాల్గొన్నారు.



కడా అధికారితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పంటల సాగుపై అవగాహన



కృష్ణా: పత్తి, వరి పంటల సాగుతో పాటు సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ముడుమాల్ రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సాగుపై సలహాలు, సూచనలను అందించారు. రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ మానస సూచించారు.

సందెపురాళ్ల వితరణ



సందేపురాళ్లతో గ్రామ యువకులు, పెద్దలు

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లిలోని పలువురు గ్రామ పెద్దలు యువకుల కోసం సందెపురాళ్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా నర్సింగప్ప మాట్లాడుతూ.. గ్రామంలో జరిగే వివిధ శుభకార్యాలు, జాతరల సందర్భంగా సందెపురాళ్లు ఎత్తు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే గ్రామంలో ప్రధాన సందేపురాళ్లు లేకపోవడంతో గ్రామ యువకులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు గమనించామన్నారు. అందుకోసమే గ్రామ పెద్దల సమిష్టి నిర్ణయంతో యువకుల కోసం 20 కేజీల నుంచి 100 కేజీల సందెపురాళ్లను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలను యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగప్ప, సూతారి రవి, సోమలింగం, భాస్కర్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ఊట్కూరు: రైతులకు రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ చేపట్టడంతో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, కొక్కు శంకర్, సూర్యప్రకాష్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, మహేష్‌రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కోస్గి: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాబురావు పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచందర్‌రావు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులతో పాటు ఆస్పత్రికి వచ్చిన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి వెన్న శేఖర్, ఆస్పత్రి వైద్యుడు రహీం తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ముగ్దుంపూర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ హనుమంతు, లయన్స్‌క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో అన్నదానం చేస్తున్న సభ్యులు

కొత్తపల్లిలో గ్రామ దేవతకు బోనాలు



కొత్తపల్లిలో బోనాలతో ఊరేగింపు చేస్తున్న భక్తులు

మద్దూరు: ఆషాఢమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి మండల కేంద్రంలో భువనమ్మకు బోనమెత్తారు. ప్రజలు భువనమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. డప్పు చప్పుళ్ల మధ్య ప్రతి ఇంటి బోనాల ఊరేగింపు గ్రామంలోని అన్ని వీధుల గుండా అలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. వర్షాలు మంచిగా కురిసి, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

ధన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉదయం ప్రతి ఇంటి నుంచి బోనాల కుండలతో మహిళలు ర్యాలీగా కట్టమీది ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు నైవేద్యాలు సమర్పించారు.



ధన్వాడలో..

పాఠశాలలో మధ్యాహ్న భోజన గిన్నెలు చోరీ



పాఠశాలను పరిశీలిస్తున్న పోలీసులు

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు భద్రత కరువైందని పాఠశాల జీహెచ్ఎం మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలోని వంట గదిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే గిన్నెలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వంట ఏజెన్సీ మహిళ లక్ష్మీదేవమ్మను అడగగా రోజు మాదిరిగానే వంట గదికి తాళాలు వేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో కొన్నిరోజులుగా కొందరు ఆకతాయిలు తాళాలు పగలగొట్టి పాఠశాలలో నిత్యం మద్యం తాగుతున్నారన్నారు. ఘటనపై మాగనూర్ పోలీసులు విచారణ జరిపారు. పాఠశాల వైపు నిఘా పెంచుతామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

'కస్తూర్బా' ప్రవేశాల్లో రాజకీయ ఒత్తిళ్లు తగవు

మరికల్: పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో రాజకీయ ఒత్తిళ్లు లేకుండా విద్యార్థులను చేర్చుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందించారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇతర మండలాలకు చెందిన విద్యార్థులను కస్తూర్బా విద్యాలయంలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌పై ఒత్తిడి చేయడం సరికాదన్నారు. ఇతర మండల విద్యార్థులను చేర్చుకుంటే స్థానిక విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్థానికేతర మండలాల విద్యార్థుల అడ్మిషన్లు రద్దు చేసి మరికల్ మండలానికి చెందిన, తల్లిదండ్రులు లేని, వలస వెళ్లిన వారి పిల్లలను చేర్చుకోవాలని కోరారు. అర్హులకు న్యాయం జరగకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఈ విషయంపై స్పందించిన ప్రిన్సిపాల్ స్థానిక విద్యార్థులకే అధిక ప్రాధాన్యత ఇచ్చామని, విద్యార్థుల ఎంపిక కూడా జిల్లా కేజీబీవీ అధికారి పద్మనళిని సమీక్షంలో జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, రాజేష్, మల్లేష్, నరేష్‌గౌడ్, తిరుపతయ్య, రవిప్రకాష్, బాల్‌రాజుగౌడ్, ఆంజనేయులు, సురేష్, రఘు, శ్రావణ్, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మద్దూరు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినా.. ప్రస్తుత బడ్జెట్‌లో 7.31 శాతం నిధులు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిధులు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలకు సరిపోతుందని, విద్యారంగాన్ని ఏ విధంగా బలోపేతం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీను, విజయ్, అశోక్, మౌనిక, కల్పన, విద్యశ్రీ, అఖిల, అనురాధ, అనిత, ఐశ్వర్య, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

నారాయణపేట: జనాభాలో 50శాతం బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఓబీసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, న్యాయవాది రఘువీర్‌యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు అనుగుణంగా బడ్జెట్ తగిన నిధులు కేటాయించాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.